సాక్షి
చిత్తూరు
గురువారం । 20 । ఫిబ్రవరి । 2025



పొరపాట్లకు తావివ్వొద్దు..

పది, ఇంటర్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. - 8లో



లక్ష కుంకుమార్చన

బోయకొండ గంగమ్మ ఆలయంలో ఘనంగా లక్ష కుంకుమార్చన నిర్వహించారు. పెద్దసంఖ్యలో దంపతులు హాజరయ్యారు. - 8లో



పార్టీకో నిబంధన

పార్టీలను అనుసరించి రెవెన్యూ అధికారులు నిబంధనలు మారుస్తుండడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఎన్నికల గౌరవ వేతనం రూ.1.44 కోట్ల విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : గత సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బంది గౌరవ వేతనం రూ.1.44 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ వివేక్ యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లాలో గత సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన అధికారులు, సిబ్బందికి కలెక్టరేట్ ఎన్నికల విభాగం త్వరలో జమ చేయనుంది.

సులభ పద్ధతుల్లో బోధన



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్

కార్వేటినగరం : ఉపాధ్యాయులు తమ తరగతి బోధనాంశ ప్రక్రియలో గుర్తించిన సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రణాళిక వేసుకుని, అమలు చేసి వివరాలను రికార్డు చేయడమే యాక్షన్ రీసెర్చ్ అని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్ పేర్కొన్నారు. బుధవారం డైట్ ఆడిటోరియంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సులభ పద్ధతిలో అర్థమయ్యే విధంగా బోధన చేపట్టడానికి ఈ శిక్షణ దోహద పడుతుందన్నారు. ఎంపిక చేసిన ఉపాధ్యాయులు డైట్‌లో నిర్వహించే యాక్షన్ రీసెర్చ్‌కు అనుగుణంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించి ఆ అంశాలను విద్యార్థులకు బోధించాలని చెప్పారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్‌లు ప్రభాకర్, చెంగల్‌రాజు, సునీత, నిర్మల, దేవప్రసాద్, రఫీ, అనిత, నాగరాజునాయక్, పలువురు ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోడల్ ఫౌండేషన్ పాఠశాలలు సందర్శించండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఉన్న మోడల్ ఫౌండేషన్ పాఠశాలలను సందర్శించాలంటూ ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ వెంకట కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులు డీఈఓ కార్యాలయానికి అందాయి. ఆ మేరకు జిల్లాలోని మోడల్ ఫౌండేషన్ పాఠశాలలను సందర్శించాలని ఆదేశించారు. ఈసీసీఈ, ఎఫ్‌ఎల్ఎన్ కార్యకలాపాల ప్రదర్శన తరగతులను పర్యవేక్షించాలన్నారు. పర్యవేక్షించేందుకు జిల్లాలోని డైట్ అధ్యాపకులను నియమించారు.

రీసర్వేను పారదర్శకంగా నిర్వహించాలి



రీసర్వే రికార్డులను పరిశీలిస్తున్న జేసీ విద్యాధరి

తవణంపల్లె : రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆదేశించారు. బుధవారం సాయంత్రం చెర్లోపల్లెలో రీసర్వేను పర్యవేక్షించారు. సర్వే ఎలా చేస్తున్నారు? ఎప్పటికి పూర్తి చేస్తారని ఆరా తీశారు. పారదర్శకంగా రీసర్వే చేయాలని ఆదేశించారు. ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తగా చేపట్టాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీల గురించి చర్చించారు. తహసీల్దార్ సుధాకర్ రెవెన్యూ సదస్సుల్లో 174 అర్జీలు వచ్చినట్లు వివరించారు. ఇందులో 86 అర్జీలను పరిష్కరించామని మిగిలిన అర్జీలను త్వరలో పరిష్కరిస్తామని వివరించారు. మండల సర్వేయర్ మురళీమోహన్, ఆర్ఐ జీవన్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విలీనబడి కష్టాలు



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

గంగాధరనెల్లూరు : మా పిల్లలను ఊరిలోని బడికి కాకుండా ప్రభుత్వం మెర్జ్ చేసిన గ్రామానికి దూరంగా ఉన్న మరో పాఠశాలకు పంపలేమని మండల పరిధిలోని కట్టకందపల్లి హరిజనవాడ గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ-1 ఆంజనేయులు శెట్టికి వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం ఎస్ఎంసీ చైర్మన్ బాబు మాట్లాడుతూ.. కట్టకందపల్లి హరిజనవాడ నుంచి వేపంజేరి గ్రామానికి మూడు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉన్నందున మా పిల్లలను ఆ పాఠశాలకు పంపలేమని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలోని పాఠశాలను వేరే పాఠశాలలో కలపడాన్ని తిరస్కరిస్తున్నామని గ్రామస్తులు పేర్కొన్నారు.

ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో ఎవరూ ఊహించలేం.. అకస్మాత్తుగా ఏదైనా ప్రమాదం సంభవిస్తే అందుకు తగ్గ ఏర్పాట్లు ఆర్టీసీ అధికారులు చేసుండాలి. అర్ధరాత్రి సమయాల్లో ప్రమాదం జరిగితే ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్‌లో కనీసం దూది కూడా ఉండడం లేదు. రోజు లక్షల సంఖ్యలో ప్రయాణిస్తున్న బస్సుల్లో ఇంత నిర్లక్ష్యం కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికుల భద్రత గాలిలో దీపంలా మారింది. వీటిని ప్రతి నెలా పర్యవేక్షించాల్సిన రవాణా అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేసి మమ అనిపిస్తుండడంపై ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





అలంకారప్రాయంగా ప్రథమ చికిత్స పెట్టె

ఫస్ట్‌ఎయిడ్ నిర్లక్ష్యం

- ఆర్టీసీ బస్సుల్లో ఖాళీ పెట్టెలు
- అలంకారప్రాయంగా ప్రథమ చికిత్స బాక్సులు
- ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స.. గోవిందా..
- మోటారు వాహన చట్టానికి ఆర్టీసీ అధికారుల తూట్లు
- పట్టించుకోని రవాణా అధికారులు

చిత్తూరు రూరల్(కాణిపాకం) : ఆర్టీసీలో సురక్షిత ప్రయాణమే లక్ష్యం అనే నినాదం బాగున్నా.. కనీసం పాటించాల్సిన ప్రథమ చికిత్స బాక్స్‌లు ఔషధాలు లేకుండా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. బస్సుల నిర్వహణలో లోపాలు తేటతెల్లమవుతున్నాయి. ప్రధానంగా ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఆర్టీసీలో అలంకారప్రాయంగా మారాయి. దీంతో ప్రమాద సమయంలో ప్రథమ చికిత్స దిక్కే లేకుండా పోయింది. మోటారు వాహన చట్టానికి ఆర్టీసీ అధికారులు తూట్లు పొడుస్తున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు.

నిధులు లేక..

రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స ఎంతో అవసరం. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మొదటి 15 నిమిషాలు ఎంతో విలువైనది. క్షతగాత్రుల ప్రాణాలు కాపాడాలంటే ఆ సమయంలో చేసే చికిత్స ఎంతో కీలకం. దీని కోసమే అన్ని వాహనాల్లోనూ ప్రథమ చికిత్స బాక్సులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. కానీ ఆర్టీసీ బస్సుల్లో మాత్రం వీటి నిర్వహణ అధ్వానంగా మారింది. పలు బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో ఉన్న ప్రథమ చికిత్స బాక్సుల్లో అవసరమైన మందులు మచ్చుకైనా కనిపించడం లేదు. కొన్ని బస్సుల్లో గడువు తీరిన మందులు, మరికొన్ని బస్సుల్లో ఖాళీ బాక్సులు, ఇంకొన్ని బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో ఇతర వస్తువులు కనిపిస్తున్నాయి.

ప్రైవేటు అంబులెన్స్‌ల కోసం ..

ఆర్టీసీ బస్సుకు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రైవేటు అంబులెన్సులు, ఆటోలు,108 వాహనాల కోసం ఎదురుచూడడం తప్ప మరో దారి లేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో ఔషధాల కొనుగోలుకు నిధులు మంజూరు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రథమ చికిత్స బాక్సుల్లో ఉండాల్సినవి..

ప్రథమ చికిత్స పెట్టెలో ఉండాల్సిన సామగ్రి 17 రకాల దాకా ఉన్నాయి. ఎలాస్టిక్ బ్యాండేజ్ రోలర్స్ 5, బెటాడిన్ ఆయింట్‌మెంట్, డెటాల్ లేదా ఐయోడిన్, స్టైరిలైజ్డ్ కాటన్ బండిల్స్, నియోసిన్ పౌడర్ డబ్బా, సర్జికల్ బ్లేడ్, బర్నాల్ ఆయింట్ మెంట్, వాటర్ ప్రూఫ్ ప్లాస్టర్, బ్యాండ్ ఎయిడ్ ప్లాస్టర్లు, నైట్రోజన్, పెరాక్సైడ్, దూది, స్పిరిట్, పెయిన్ కిల్లర్ మాత్రలు, కడుపు నొప్పి, జ్వరం, విరేచనాలకు మాత్రలు తదితరాలు అందులో ఉండాలి.

అలసత్వంలో అధికారులు

ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో మందులు ఏర్పాటు చేయకపోతే బస్సులను సీజ్ చేసే అధికారం ఆర్టీఓ స్థాయి అధికారులకు ఉంటుంది. అయినప్పటికీ ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్టీసీ నిర్వహణలో ఉన్న వాటిని ప్రభుత్వ బస్సులేనన్న భావనతో రవాణా అధికారులు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలున్నాయి. అనుమతుల కోసం రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లినప్పుడు మాత్రమే అలంకారప్రాయంగా వీటిని ఏర్పాటు చేస్తుంటారు. ఆ తర్వాత మళ్లీ కనిపించవు.

ప్రమాదం జరిగితే అంతేసంగతి..



ఆర్టీసీ బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెల్లో ఔషధాలు ఉండడంలేదు. ప్రభుత్వ నిర్వహణలో ఉన్న బస్సుల్లోనే నిబంధనలు పాటించకపోతే ప్రైవేటు బస్సుల్లో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటుందనేది వాస్తవం. ప్రయాణికుల భద్రతకు నిజంగా విలువనిస్తే ఆర్టీసీ అధికారులు వెంటనే ప్రథమ చికిత్స పెట్టెల్లో అవసరమైన మందులు ఉంచడంతో పాటు, నిర్వహణ సక్రమంగా ఉండేలా పర్యవేక్షించాలి.

– బాలాజీ, చిత్తూరు

డ్రైవర్లు, కండక్టర్లు నిబంధనలు పాటించాలి



ఆర్టీసీ బస్సుల్లో ప్రథమ చికిత్స బాక్సుల్లో అవసరమైన మందులు ఉండేలా డ్రైవర్లు, కండక్టర్లకు సూచించాం. వాటికి తాళాలు వేసి అత్యవసర సమయాల్లో తెరిచి ప్రథమ చికిత్స చేయాలి. ప్రతి నెలా ఫస్ట్ ఎయిడ్ బాక్సులను తనిఖీ చేసుకొని వాటిలో మందులు గడువు తీరితే వెంటనే వాటి స్థానంలో కొత్తవి ఉండాలి. ఫస్ట్ ఎయిడ్ బాక్సులను ప్రయాణికులకు ఉపయోగపడేలా నిర్వహిస్తాం. ఈ విషయంలో డ్రైవర్లు, కండక్టర్లు నిబంధనలు పాటించాలి.

– జగదీష్, డీపీటీఓ, చిత్తూరు

జిల్లాలోని ఆర్టీసీ బస్సుల వివరాలు..

డిపోల సంఖ్య	5
మొత్తం బస్సుల సంఖ్య	400
పల్లెవెలుగు	233
ఎక్స్‌ప్రెస్	100
సప్తగిరి ఎక్స్‌ప్రెస్	33
సూపర్‌లగ్జరీలు	30
ఇంద్ర	04
రోజువారి తిరిగే కి.మీ	1.50 లక్షలు
రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య	1.11 లక్షలు

ప్రతి జిల్లా కేంద్రంలో ఆర్టీసీ డిస్పెన్సరీ ఉంది. అవి లేని చోట జిల్లా ఆస్పత్రులు ఉన్నాయి. ప్రథమ చికిత్స బాక్సుల్లో మందులు పెట్టాల్సి వస్తే ఆస్పత్రులకు ఇండెంట్ పెట్టి తీసుకోవచ్చు. అయినప్పటికీ ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు.

మొక్కుబడిగా పెట్టి.. వదిలేయడం

కేంద్ర మోటారు వాహన చట్టం 1939 ప్రకారం ప్రయాణికుల వాహనాల్లో విధిగా ప్రథమ చికిత్స బాక్సులు ఏర్పాటు చేయాలి. ఈ చట్టాన్ని మరింత పటిష్టం చేస్తూ 1988లో మరిన్ని సవరణలు చేశారు. నిబంధనల ప్రకారం ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు, ఇతర వస్తువులను బాక్సుల్లో ఉంచాలి. లైసెన్సు పొందే ముందు బస్సు డ్రైవర్, కండక్టర్ తప్పనిసరిగా వారం రోజుల పాటు ప్రథమ చికిత్స చేయడంపై శిక్షణ పొందాలని, ప్రతి మూడేళ్లకోసారి లైసెన్సును పునరుద్ధరించుకోవాలని చట్టం నిర్దేశిస్తుంది. ప్రయాణికులు గాయపడితే వారికి ప్రథమ చికిత్స చేసే సామర్థ్యం బస్సు డ్రైవర్, కండక్టర్లకు ఉంటుంది. రవాణా శాఖ అధికారుల నుంచి బస్సులకు ఫిటెనెస్ సర్టిఫికెట్ పొందే సమయంలో మాత్రమే మొక్కుబడిగా ప్రథమ చికిత్స కిట్లను చూపుతున్నారు. ఆ తర్వాత వాటి నిర్వహణను గాలికొదిలేస్తున్నారు. బస్సులు నడిపేటప్పుడు అకస్మాత్తుగా బ్రేక్ వేస్తే ఒక్కోసారి కొందరు ప్రయాణికులు గాయపడుతున్న సందర్భాలు ఉంటున్నాయి. అలాంటప్పుడు ప్రథమ చికిత్స కిట్టు ఉంటే కొంతమేర ఉపశమనం ఉంటుంది.



వైద్యులు అలసత్వం వీడాలి

- పీహెచ్‌సీల్లో ఎందుకు అందుబాటులో ఉండటం లేదు?
- రాత్రి వేళల్లో కచ్చితంగా అందుబాటులో ఉండాలని ఆదేశం
- వరుస సమీక్షల్లో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది సమయపాలనలో నిర్లక్ష్యం వీడాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖలతో వరుస సమీక్షలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో మెడికల్ ఆఫీసర్‌లు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. జిల్లాలో 24 గంటల పాటు పనిచేసే పీహెచ్‌సీల్లో రాత్రి వేళల్లో సిబ్బంది ఎందుకు అందుబాటులో ఉండడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి పీహెచ్‌సీల్లో ఓపి ఎంత ? ఎఫ్‌ఆర్‌ఎస్ అటెండెన్స్ సేవలు అందించే విధానం ను పీహెచ్‌సీల వారీగా మెడికల్ ఆఫీసర్‌లతో నిత్యం సమీక్షిస్తామన్నారు. ఎన్‌సీడీ సర్వే కొన్ని పీహెచ్‌సీలలో వేగంగా జరుగుతోందని, ఇంకొన్ని చోట్ల నామమాత్రంగా చేస్తున్నారని మండిపడ్డారు. పీహెచ్‌సీలలో పరికరాల సమగ్ర నివేదికను ఈనెల 21 లోపు అందజేయాలన్నారు. సమీక్షలో డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి, డీసీహెచ్ఎస్ ప్రభావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

మార్చి 2 లోపు సర్వే పూర్తి చేయండి

జిల్లాలో దారిద్ర్య రేఖకు దిగువనున్న వారిని మార్చి 2లోపు గుర్తించి ఆర్థిక సాధికారతకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అట్టడుగు స్థాయిలో ఉంటూ జీవించడానికి కనీస సౌకర్యాలు లేని వారి జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు పీ4 విధానాన్ని (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్ షిప్) అవలంబిస్తున్నామన్నారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న వారిని గుర్తించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సూచించిన ప్రమాణాలను అనుసరించి నేటి నుంచి మార్చి 2 వరకు సర్వే చేయాలన్నారు. సమీక్షలో సీపీఓ సాంబశివారెడ్డి, డీఎల్‌డీఓ రవికుమార్ పాల్గొన్నారు.

బాలిక మృతిపై విచారణ వేగవంతం

పలమనేరు : మండలంలో పదో తరగతి చదువుతున్న బాలిక మృతిపై స్థానిక డీఎస్పీ ప్రభాకర్, సీఐ నరసింహరాజు బుధవారం గ్రామంతో పాటు బాలిక చదివిన పాఠశాలలో విచారించారు. బాలిక తొమ్మిదినెలల గర్భం దాల్చినా ఎందుకు గుర్తించలేదని అక్కడి టీచర్లను ప్రశ్నించారు. మరోవైపు ఈ కేసుకు సంబంధించి అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. దీంతోపాటు స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓ ఇందిరా, ఐసీపీస్ అధికారులు గ్రామంలో జరిగిన సంఘటనపై సమగ్రంగా విచారించారు.

డీఎన్ఏ టెస్ట్ చేశాకే నిందితుల అరెస్ట్

ఇప్పటికే అనుమానితులుగా పోలీసుల విచారణ చేస్తున్న వారి డీఎన్ఏ, బాలిక ప్రసవించిన బాబు డీఎన్ఏను విజయవాడలోని ల్యాబ్‌లో పరిశీలించాక పోలీసులు నిందితుడిని గుర్తించేందుకు వీలుంటుంది.

అనుమానితులు టీడీపీ సానుభూతి పరులేనా?

బాలిక మృతి కేసులో అనుమానితులుగా ఉంటూ పోలీసులు కస్టడీలో ఉన్న ఇరువురు తాపీ పనులు చేసుకొనే వ్యక్తులు గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతి పరులుగా తెలుస్తోంది. ఈ కారణంగానే కూటమి నేతలు, స్థానిక ఎమ్మెల్యే గానీ కనీసం బాధితులను పరామర్శించేందుకు సైతం రాలేదనే మాట వినిపిస్తోంది.

కోలుకుంటున్న శిశువు

తిరుపతి తుడా: పలమనేరు మండలంలో నవజాత శిశువుకు జన్మనిచ్చి బాలిక మృతి చెందడం తెలిసిందే. ఆ శిశువుకు తిరుపతి రుయాలో వైద్యులు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. తొలి రెండు రోజులు చిన్నారి ఆరోగ్యం కుదుటపడడం కష్టతరంగా ఉందని వైద్యులు భావించారు. నెలలు నిండకనే జన్మించడం, బరువు తక్కువగా ఉండడం వంటి కారణాలను గుర్తించారు. ప్రస్తుతం ఆరోగ్యం కొంత కుదుటపడుతోందని తెలిపారు. ఆరోగ్యం మెరుగుపడడంతో మధ్యాహ్నం వెంటిలేటర్ సహాయాన్ని తొలగించి సీటాప్ మిషన్‌పై వైద్యం అందిస్తున్నారు.

టీటీడీ పాలకమండలి సభ్యుడి అనుచిత వ్యాఖ్యలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీవారి సన్నిధిలో దుర్భాషలాడడంపై మండిపడుతున్నారు. భక్తుల సేవలో నిమగ్నమైన ఉద్యోగిని అవహేళన చేయడంపై ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో టీటీడీ ఉద్యోగ సంఘాల నేతలు ఆందోళన తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడారు. నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తిస్తుంటే దౌర్జన్యం చేయడమేంటని ప్రశ్నించారు. ఉద్యోగిని అవమానించిన బోర్డు మెంబర్ నరేష్‌కుమార్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ఎదుట నిరసనకు దిగనున్నట్లు స్పష్టం చేశారు.



టీటీడీ ఉద్యోగిని దూషిస్తున్న బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్ (ఫైల్)

అనుచితం.. అమానుషం

టీటీడీ బోర్డు సభ్యుడి వ్యవహారశైలిపై ఉద్యోగుల ఆగ్రహం

- తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్
- నేడు పరిపాలన భవనం ఎదుట నిరసన

తిరుపతి కల్చరల్ : పవిత్రమైన తిరుమల శ్రీవారి సన్నిధిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి బాలాజీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన టీటీడీ బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్ తీరును వ్యతిరేకిస్తూ గురువారం నిరసనకు దిగనున్నట్లు టీటీడీ ఉద్యోగ సంఘాల నేతలు ప్రకటించారు. ఈమేరకు బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీటీడీ వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగ సంఘ నేతలు మాట్లాడారు. టీటీడీ బోర్డు ఆదేశాల మేరకు తిరుమలలో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. టీటీడీ నిబంధనలను మేరకు పనిచేస్తూ భక్తులకు నిరంతరం సేవలు అందిస్తున్నారని వెల్లడించారు. పవిత్రమైన టీటీడీ బోర్డులో స్థానం దక్కిన బోర్డు సభ్యులు సైతం నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు విరుద్ధంగా బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్ కేవలం రెండు నిమిషాల్లో ఆలయ మహద్వారం ఎగ్జిట్ గేటును తీయలేదని ఓర్పును కోల్పోయి అసభ్యంగా మాట్లాడుతూ ఉద్యోగి బాలాజీని అవమానించడం దుర్మార్గమన్నారు. గత మూడు నెలలుగా ఇలాంటి ఘటనలు పునరావృత్తం కావడంతో ఉద్యోగులు బలవుతున్నారని వాపోయారు. భవిష్యత్తులో ఇలాంటి దుశ్చర్యలు జరగకుండా సమష్టిగా సమావేశమై నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అనుచిత వ్యాఖ్యలతో అవమానించిన టీటీడీ బోర్డు సభ్యుడిపై తక్షణ చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్‌తో నిరసన చేపడుతున్నట్లు ప్రకటించారు. ఉద్యోగిపై టీటీడీ బోర్డు సభ్యుడు వ్యవహరించిన తీరును పలువురు విమర్శించారు.

కించపరచడం తగదు



నిరంతరం భక్తులకు సేవలందిస్తూ విధులు నిర్వహించే టీటీడీ ఉద్యోగి బాలాజీని టీటీడీ బోర్డు సభ్యుడు సహనానం కోల్పోయి కించపరచడం తగదు. ఆది ఆయన అజ్ఞానానికి నిదర్శనం. టీటీడీ ఉద్యోగులను అమానించే తీరుకు అందరూ స్వస్తి పలకాలి. ఇలాంటి వారిపై తక్షణ చర్యలు తీసుకొని ఉద్యోగుల్లో భద్రతా భావాన్ని పెంచేందుకు కృషి చేయాలి.

– వంకీపురం పవన్, కల్యాణ కట్ట నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు

దుర్భాషలు హేయం



రాత్రి, పగలు విధులు నిర్వహిస్తూ భక్తులకు సేవలు అందించే టీటీడీ ఉద్యోగులను అవహేళనంగా దుర్భాషలాడి అవమానించడం హేయం. మహద్వారం ఎగ్జిట్ గేటు తీయకూడదని టీటీడీ యాజమాన్యం ఆదేశాలు ఇచ్చింది. అధికారుల ఆదేశాలను పాటిస్తే తప్పుగా భావిస్తూ సహనం కోల్పోయి ఉద్యోగిని అందరి ముందు తిట్టడం సరికాదు. ఇలాంటి చర్యలను ఉద్యోగులు ఖండించకపోతే భవిష్యత్తులో వారిపై చులకన భావనం పెరిగే ప్రమాదం. ఉద్యోగిని తిట్టిన టీటీడీ బోర్డు సభ్యుడిపై చర్యలు తీసుకునే వరకు పోరాటం సాగిస్తాం.

– హేమలత, టీటీడీ పద్మావతి మహిళా అసోసియేషన్ అధ్యక్షురాలు

పవిత్రతను కాపాడాలి



టీటీడీ ఉద్యోగిపై దౌర్జన్యానికి పాల్పడిన బోర్డు సభ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి. తద్వారా భక్తుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాల్సిన అవసరం టీటీడీ యాజమాన్యం, ప్రభుత్వంపై ఉంది. అత్యున్నత స్థాయి పాలక మండలిలో సభ్యుడై ఉండి కనీస మర్యాద పాటించకుండా బూతులు మాట్లాడడం అత్యంత దుర్మార్గం. ఏళ్ల తరబడి భక్తుల సేవలో ఉన్న ఉద్యోగుల పట్ల సద్భావంతో వ్యవహరించి టీటీడీ పవిత్రతను కాపాడాల్సిన అవసరం ఉంది.

– కందారపు మురళి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి.

క్షమాపణ చెప్పాలి



సనాతన ధర్మాన్ని పాటిస్తూ ఆధ్యాత్మిక చింతనతో వ్యవహరించాల్సిన టీటీడీ బోర్డు సభ్యుడు విధి నిర్వహణలో ఉన్న టీటీడీ ఉద్యోగి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత దారుణం. మహద్వారం గేటు తీయడంలో ఆలస్యం చేశారన్న నెపంతో నిగ్రహాన్ని కోల్పోయి అందరి ముందు బూతులు తిడుతూ హేళనం చేయడమేకాక ఆలయం వెలుపలకు వెళ్లిపో అని హెచ్చరిక చేయడం హేయమైన చర్య. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి.

– పి.మురళి, సీపీఐ జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి ఇంటర్ విద్యార్థి మృతి


మృతి చెందిన సంతోష్

పుంగనూరు : ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇంటర్ విద్యార్థి మృతి చెందిన సంఘటన బుధవారం పుంగనూరు– ముళబాగిల్ రహదారిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు .. మండలంలోని వనమలదిన్నె పంచాయతీ బసివినాయునిపల్లెకు చెందిన ఆదినారాయణ కుమారుడు సంతోష్ (17) పుంగనూరు బసవరాజ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం స్నేహితుడితో కలసి ద్విచక్ర వాహనంపై పుంగనూరు –ముళబాగిల్ రహదారిలో ఉన్న కత్తార్లపల్లెకు వెళ్లి తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడటంతో సంతోష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


ఫుట్‌బాల్ సమాఖ్యకు పీడీ ఎంపిక


విక్రంరాజ్, ఫిజికల్ డైరెక్టర్

పలమనేరు : పట్టణానికి చెందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీడీగా పనిచేస్తున్న విక్రమ్‌రాజ్ ఆల్ ఇండియా ఫుట్‌బాల్ సమాఖ్యకు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన ఎంపికల్లో జిల్లా నుంచి ఈయన మాత్రమే ఎంపిక అయ్యారు.

పల్లెల్లో నిరంత రాయంగా త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం ఘనంగా ఉన్నా క్షేత్ర స్థాయిలో చతికిలపడుతోంది. జూన్ నాటికి పనులు పూర్తి చేయాలనే లక్ష్యం మేడిపండు చందంగా మారింది. గుత్తేదారులు పనులు చేసేందుకు వెళుతున్నా..కమీషన్‌లు ఇవ్వందే పనులు ముందుకు సాగనివ్వమని స్థానిక కూటమి నేతలు భయపెడుతున్నారు. దీంతో డీల్ కుదుర్చుకుంటేనే పనులు సాగనిస్తున్నారు. ఫలితంగా పనులు నత్తతో పోటీపడుతూ పల్లె ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా మరో కొన్ని నెలలు అందుబాటులోకి వచ్చే పరిస్థితి కానరావడం లేదు.

డీల్ కుదిరితే.. పనులు!



- నత్తనడకన ఆర్‌డీఎస్ పనులు
- అభివృద్ధికి కూటమి నేతల ఆటంకం
- గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్ ఇవ్వాలని లక్ష్యం
- జిల్లాలో రూ.700 కోట్లతో పనులు
- 25 శాతమే పనులు జరిగిన వైనం
- జూన్ నాటికి ముగియనున్న గడువు
- అధికార పార్టీ నేతల దందా

చిత్తూరు కార్పొరేషన్ : ప్రతి పల్లెకు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా ఇవ్వాలని 2023లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాలో రూ.700 కోట్లతో ఆర్‌డీఎస్‌ఎస్ (రీవాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్) పథకాన్ని ప్రవేశపెట్టారు. పూర్తి స్థాయిలో పనులు ప్రారంభమై వేగం పుంజుకుంటున్న సమయంలో ఎన్నికల కోడ్‌తో పనులు నిలిచిపోయాయి. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. ఈ ఏడాది జూన్ నాటికి పనులు పూర్తి చేయాలనే లక్ష్యం ఉండగా ఇప్పటి వరకు దాదాపు 10 శాతం నిధులు ఖర్చు చేయగా 25 శాతం పనులు మాత్రమే జరిగాయి.

ప్రతిసారి అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పుకునే టీడీపీ కాంట్రాక్టర్లను మార్పు చేయాలని చూశారు. కుదరకపోవడంతో తమకు కమీషన్ డబ్బులు చెల్లించకుండా పనులు చేయడానికి వీల్లేదని అభివృద్ధికి అడ్డుపడ్డారు. చిత్తూరు, పూతలపట్టులో దాదాపు డీల్ కుదిరినట్లు సమాచారం. ఇక పుంగనూరులో టీడీపీ నేతతో బేరాలు చేస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో మధ్యే మార్గంగా వెళుతున్నారు. దీంతో మూలిగే నక్క మీద తాటికాయ పడ్డ చందంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. అసలే బిల్లులు రాక కాంట్రాక్టర్లు ఏడుస్తుంటే కూటమి నాయకుల వేధింపులతో అల్లాడుతున్నారు. పనులు వేగం పెంచి నిర్ణీత గడువు పెంచడానికి అనుమతి కోరాలనేది వారి ఉద్దేశ్యం. కానీ క్షేత్ర స్థాయిలో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది.

జిల్లా సమాచారం

మొత్తం రూరల్ ఫీడర్లు	420
9.1 మీటర్ల పోల్స్ పెట్టాల్సినవి	74,000
ఇప్పటి వరకు ఏర్పాటు చేసినవి	16,800
8 మీటర్ల పోల్స్ పాతాల్సినవి	15,000
ఇప్పటి వరకు పెట్టినవి	5,200
ట్రాన్స్‌ఫార్మర్ల లక్ష్యం	1000
క్షేత్రస్థాయిలో ఏర్పాటు	40
మొత్తం ప్రాజెక్టు విలువ	రూ.700 కోట్లు
ఇప్పటి వరకు చేసిన వ్యయం	రూ.74 కోట్లు

మెరుగైన సరఫరా కోసం

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లోని 420 ఫీడర్లలో పనులు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు పలు దశల్లో 123 ఫీడర్ల పనులు జరుగుతున్నాయి. ప్రధానంగా లో ఓల్టేజీ సమస్య పరిష్కరించి మెరుగైన విద్యుత్ సరఫరా ఇవ్వాలని పెట్టుకున్న లక్ష్యం నీరుగారుతోంది. కేంద్రం 60 శాతం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వ పరంగా పనులు చేయాలని నిర్దేశించారు. వ్యవసాయ రంగానికి ప్రత్యేక ఫీడర్లతో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయనున్నారు.

సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్ల స్థానంలో..

గ్రామాల్లోని నివాసాలు, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు త్రీఫేజ్ ఇవ్వాలనేది ఆర్‌డీఎస్ పథకం లక్ష్యం. గ్రామాలకు ఇప్పటి వరకు సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్లు ఉన్నాయి. ఫలితంగా పరిమిత వ్యవధిలో మంచినీటి సరఫరా సాగుతోంది. చాలా గ్రామాలు ఏళ్ల తరబడి లోఓల్టేజీ సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఇంత వరకూ జిల్లా, మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో మాత్రమే త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ కారణాలతోనే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పట్టణాలు, నగరాలకు వెళ్లి పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. పల్లెలో విరివిగా స్థలాలున్నప్పటికీ పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి చూపడం లేదు. ఈ సమస్యలను అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆర్‌డీఎస్‌ఎస్ పనులు ప్రారంభించారు.


గుడిపాల నంగమంగళం వద్ద విద్యుత్ స్తంభాలు పాతి లైన్‌లు లాగకుండా వదిలేసిన సిబ్బంది

మహిళా సాధికారతే లక్ష్యం


వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఉమ

తిరుపతి సిటీ : మహిళా సాధికారతే లక్ష్యంగా పద్మావతి యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తామని వైస్ చాన్సలర్ వి.ఉమ తెలిపారు. బుధవారం ఈ మేరకు వీసీగా పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రతిష్టాత్మక విద్యాలయంలో నిపుణులు, సమర్థులైన అధ్యాపకులు ఉన్నారని వెల్లడించారు. బోధన, బోధనేతర సిబ్బంది సహకారంతో వర్సిటీని అంతర్జాతీయ స్థాయి తీసుకెళ్లేందుకు యత్నిస్తామని వివరించారు. అలాగే విద్యార్థినులను నూతన పరిశోధనల దిశగా ప్రోత్సాహం అందిస్తామని, ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. ఈ క్రమంలోనే అన్ని విభాగాల్లో అడ్మిషన్లు పెంచేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు. విద్యార్థినులకు వర్సిటీలో ఆధునాతన మౌలిక వసతులు, భద్రతకు ప్రాధాన్యతనిస్తామని వివరించారు.

రేపటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ వేడుకలకు 21న భక్తకన్నప్ప ధ్వజారోహణంతో అంకురార్పణ జరగనుంది. 22న స్వామివారి ధ్వజారోహణం, 26న మహాశివరాత్రి, రాత్రి నందిసేవ, 27న ఉదయం రథోత్సవం, రాత్రి నారద పుష్కరణితో తెప్పోత్సవం, 28న కల్యాణం, మార్చి 2న గిరిప్రదక్షిణ, 4న పల్లకీసేవ, 5న ఏకాంతసేవ, 6న శాంతి అభిషేకాలతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం కానున్నాయి.

మేయర్ దంపతుల హత్య కేసు నిందితుడు చింటూ విడుదల


చిత్తూరు జైలు బయట నిందితుడు చింటూ

చిత్తూరు అర్బన్ : చిత్తూరు మాజీ మేయర్ కటారి అనురాధ, ఆమె భర్త మోహన్ జంట హత్యల కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న చింటూ అలియాస్ చంద్రశేఖర్ బుధవారం చిత్తూరు జిల్లా జైలు నుంచి విడుదలయ్యాడు. 2015లో జరిగిన జంట హత్యల కేసులో చింటూ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. తొమ్మిదేళ్లకు పైగా ఈ కేసులో అండర్ ట్రయల్ ఖైదీగా ఉన్న చింటూకు ఇటీవల బెయిల్ మంజూరు చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే చింటూపై ఉన్న ఓ పెండింగ్ కేసులో బెయిల్‌కు దరఖాస్తు చేసుకోకపోవడంతో విడుదల ఆలస్యమయ్యింది. తాజాగా ఆ కేసులో బెయిల్ రావడంతో.. చింటూ జైలు నుంచి విడుదలయ్యాడు. నిందితుడు తిరుపతిలో ఉండాలని, జంట హత్యల కేసు విచారణ సమయంలో మాత్రమే చిత్తూరుకు రావాలనే షరతు ఉండటంతో.. జైలు నుంచి విడుదలయ్యాక తిరుపతికి వెళ్లిపోయాడు.

పది, ఇంటర్ పరీక్షల్లో పొరపాట్లకు తావివ్వొద్దు

– సమీక్షలో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ


మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ మొదటి , ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మార్చి 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఇంటర్ పరీక్షలకు మొత్తం 30,652 మంది పరీక్షకు హాజరు కానున్నట్లు ఇందులో మొదటి సంవత్సరం 15,482 మంది (జనరల్- ఒకేషనల్), ద్వితీయ సంవత్సరం 15,170 మంది (జనరల్- ఒకేషనల్) విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. ఇందుకు జిల్లా వ్యాప్తంగా 50 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17వ తేదీ నుంచి ఏప్రిల్ 1 వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా 118 కేంద్రాల్లో రెగ్యులర్ 20,954 మంది, ప్రైవేట్ 294 మంది మొత్తం 21,248 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు చీటింగ్‌కు పాల్పడిన ఎక్జామినేషన్ యాక్ట్ కింద చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్....

జిల్లాలో ఇంటర్ , పదో తరగతి పబ్లిక్ పరీక్షల కేంద్రాలు, స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్‌ను అమలు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ మోహన్‌కుమార్, ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్ మౌలా, డీఈఓ వరలక్ష్మి, తదితర అధికారులు పాల్గొన్నారు.

చికెన్‌షాపు నిర్వాహకుడిపై దాడి


చికిత్స పొందుతున్న అహ్మద్‌బాషా

పుంగనూరు : పట్టణంలో చికెన్‌షాపు నిర్వహిస్తున్న అహ్మద్‌బాషా(45)పై మంగళవారం రాత్రి దాడి చేశారు. బాధితుడి కథనం మేరకు వివరాలు ఇలా.. పట్టణంలోని చింతలవీధిలో నివాసం ఉన్న అహ్మద్‌బాషా మసీదు వద్ద చికెన్‌షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా అతడిపై భార్యకు పలు అనుమానాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి అహ్మద్‌బాషా చికెన్‌షాపులో ఉండగా భార్య తస్లిమా, కుమారుడు మహమ్మద్ ఫయాజ్, మరికొంత మంది వచ్చి దాడి చేసి గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన అహ్మద్‌బాషాను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీతారామాపురంలో చైన్ స్నాచింగ్


సీసీటీవీ పుటేజీలో చైన్ స్నాచర్లు

వడమాలపేట (విజయపురం) : వడమాలపేట మండలం సీతారామాపురంలో చైన్ స్నాచర్లు రెచ్చిపోయారు. పట్టపగలే బరితెగించిన చైన్ స్నాచర్లు ఓ మహిళ మెడలో ఉన్న బంగారం గొలుసును తెంపుకుని పరారయ్యారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. పుత్తూరుకు వెళ్లడానికి ఓ మహిళ ఆటో కోసం సీతారామాపురం ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న ఓ బంక్ వద్ద వేచి ఉండగా ఇంతలో ముగ్గురు యువకులు బైక్‌పై వచ్చి బంక్‌కు కొద్ది దూరంలో నిలుపగా అందులో నుంచి ఓ వ్యక్తి దిగి బంక్ వద్దకు వచ్చి కూల్ డ్రింక్ కావాలని అడిగాడు. ఇంతలో అంగడి యజమాని కూల్ డ్రింక్ కోసం ఫ్రిజ్ వద్దకు వెళ్లగానే అక్కడ ఆటో కోసం వేచి ఉన్న మహిళ మెడలో ఉన్న బంగారం గొలుసును లాక్కొని పరారరైనట్లు ఎస్‌ఐ ధర్మారెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బస్సులో అయిదు సవర్ల బంగారం చోరీ

- ప్రశ్నించిన మహిళకు నరకం చూపెట్టిన క్లీనర్, డ్రైవర్
- చిత్తూరులో దిగాల్సి ఉండగా బెంగళూరులో దించిన వైనం

చిత్తూరు అర్బన్ : బ్యాగులు బస్సులో ఉంచి ప్రయాణిస్తుండగా బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. దీనిపై క్లీనర్, డ్రైవర్‌ను నిలదీయడంతో చిత్తూరులో దిగాల్సిన మహిళా ప్రయాణికురాలిని, బస్సుల్లో ఎక్కించుకొని బెంగళూరులో దించారు. చిత్తూరులో జరిగిన ఈ ఘటనపై తాలూక పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మల్లికార్జున కథనం మేరకు.. చిత్తూరు నగరంలోని సంతపేటకు చెందిన రమాదేవికి ఇద్దరు పిల్లలు. రెండో కుమార్తె విజయవాడలోని పెనగలూరులో నివాసం ఉంటోంది. ఈనెల 1వ తేదీన కుమార్తె వద్దకు వెళ్లిన రమాదేవి, 10వ తేదీన విజయవాడ నుంచి ఓ ప్రైవేటు బస్సులో చిత్తూరుకు టికెట్ బుక్ చేసుకున్నారు. తన బ్యాగులో అయిదు సవర్ల బంగారు నగలను ఉంచి, బస్సు డిక్కీలో ఉంచగా.. క్లీనర్ తాళాలు వేశాడు. బస్సు చిత్తూరుకు రాగా, బ్యాగుల కోసం చూడగా.. ఆభరణాలు ఉన్న బ్యాగ్ కనిపించలేదు. దీనిపై క్లీనర్, డ్రైవర్లను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. బాధితురాలు గట్టిగా అడిగేసరికి, బస్సు ఎక్కమని చెప్పి, ఆమెను బెంగళూరుకు తీసుకెళ్లి దించేసి.. నీ వల్ల అయ్యింది చేసుకో అంటూ డ్రైవర్లు వెళ్లిపోయారు. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా బస్సు డ్రైవర్లు కరీముల్లా, రాజేష్‌తో పాటు క్లీనర్ శివపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ద్రవిడ వర్సిటీ.. ఇన్‌చార్జి పాలన

- పెండింగ్‌లో వీసీ నియామకం
- ముందుకుసాగని అభివృద్ధి పనులు


కుప్పం విశ్వవిద్యాలయం

కుప్పం : కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలో 9 నెలలుగా ఇన్‌చార్జి వీసీ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌లతో పాలనను కొనసాగిస్తున్నారు. దీంతో వర్సిటీలో అభివృద్ధి ముందుకు సాగక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారుతోంది. కూటమి అధికారంలోకి రాగానే ద్రవిడ వర్సిటీ వీసీగా ఉన్న ఆచార్య కొలకలూరి మధుజ్యోతి రాజీనామా చేయాల్సి వచ్చింది. అయితే వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా ద్రవిడ వర్సిటీ లైబ్రరియన్ ఆచార్య దొరస్వామిని, కంప్యూటర్ సైన్స్ విభాగంలోని ఆచార్య కిరణ్ కుమార్‌ను ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించారు. అప్పటి నుంచి ఒక్క ఎగ్జిక్యూటివ్ సమావేశం జరగకపోవడంతో వర్సిటీలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదు. దీంతో వర్సిటీలో ఎంతో ప్రాముఖ్యం సంతరించుకున్న న్యాక్ గ్రేడింగ్ సైతం 'బి' గ్రేడ్‌కే పరిమితం కావడంపై వర్సిటీలో తీవ్ర స్థాయిలో విమర్శలు నెలకొన్నాయి.

ఏడాదిగా జీతాలు అందక ..

న్యాక్ పీర్ టీమ్ సైతం వర్సిటీలో పాలనను మెరుగు పరుచుకోవాలని, ఇక్కడి పాలనపై అసహనం వ్యక్తం చేశారు. అదే రెగ్యులర్ వీసీ నియామకం జరిగి ఉంటే న్యాక్ గ్రేడింగ్ మరోలా ఉండి ఉంటుందని వర్సిటీలో కొంత మంది ఆచార్యులు చెబుతున్నారు. దీంతో పాటు వర్సిటీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంవత్సరానికి పైగా జీతాలు అందక అవస్థలు పడుతున్నారు. కేవలం 6 నెలల జీతాలను మొదట్లో అందించి చేతులు దులుపుకున్నారు. వీరికి సైతం జీతాలు అందించేందుకు అధికారులు సతమతమవుతున్నారు.

పెండింగ్‌లోనే నియామకం

రాష్ట్రంలో 9కి పైగా వర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించారు. అయితే కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయ వీసీ నియామకం ప్రకటించలేదు. దీంతో వర్సిటీ వీసీ నియామకాన్ని పెండింగ్‌లో పెట్టడంతో వర్సిటీలో అసంతృప్తి నెలకొంది. రెగ్యులర్ వీసీ లేకపోవడంతో ఇన్‌చార్జి పాలనతో బోధనా సిబ్బంది పదోన్నతులు , ఉన్నత విద్యకు సంబంధించిన పలు కార్యక్రమాలు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

బోయకొండలో లక్ష కుంకుమార్చన


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో ఏటా మాఘ మాసంలో వైభవంగా నిర్వహించే లక్ష కుంకుమార్చన కార్యక్రమం బుధవారం ప్రారంభమయింది. బోయకొండ ఆలయంలో 16 ఏళ్లుగా హిందూ సంప్రదాయ రీతిలో లక్ష కుంకుమార్చనను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు, అర్చకుల మంత్రోచ్చరణాల మధ్య అమ్మవారి ఉత్సవమూర్తికి ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మూడు రోజులపాటు సాగే కుంకుమార్చనలో భాగంగా అమ్మవారి ఉత్సవ మూర్తి ఎదుట ప్రత్యేక పూజలు, గణపతి, చండీహోమం, మహా మంగళ హారతి చేశారు. 142 మంది దంపతులు కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు. భక్తులతో ఆలయం రద్దీగా మారింది. అనంతరం ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఉభయదారులకు అమ్మవారి వెండి కాయిన్‌తో పాటు శేషవస్త్రం, తీర్థప్రసాదాలను దంపతులకు అందజేశారు.

పార్టీకో నిబంధన..

- కూటమి నేతలకు అధికారుల మద్దతు
- ముడిపల్లికు ఒక నియమం.. కాకవేడుకు మరొకటి
- కనుమరుగు కానున్న కాలువలు, గట్లు


కాకవేడులో కాలువ పొరంబోకును స్వాధీనం చేసుకొని వేస్తున్న రోడ్డు

నగరి : పార్టీలను అనుసరించి రెవెన్యూ అధికారుల నిబంధనలు మారుస్తుండడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రైతుల అధీనంలో ఉన్న కాలువ పొరంబోకు అంశం రాజకీయ రంగు పులుముకుంటోంది. కాలువ పొరంబోకు అధీనంలో ఉన్న నేతలు కూటమి పార్టీకి చెందినవారైతే ఒక నిబంధన, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారైతే మరొక నిబంధన అన్న చందంగా పార్టీలను అనుసరించి ఇక్కడ నిబంధనలు మారిపోతున్నాయి. అధికార పార్టీ నేతలు లిఖించిన నిబంధనలే ఇక్కడ అమలవుతున్నాయి. దీనికి మండలంలోని ముడిపల్లి, కాకవేడు ప్రాంతాల్లో కాలువ పొరంబోకుల విషయంలో అధికారుల వ్యవహార శైలి ఇందుకు అద్దం పడుతోంది. కాకవేడు ప్రాంతంలో 40 ఏళ్లుగా వైఎస్సార్‌సీపీ నేతల స్వాధీనంలోని కాలువ పొరంబోకును అధికారులు స్వాధీనం చేసుకొని ఓ టీడీపీ నేత పొలానికి వెళ్లేందుకు రోడ్డుకు వీలు కల్పించారు. చెరుకు పంట సాగులో ఉన్నా లెక్కచేయక మట్టి తోలి రోడ్డు వేశారు. అడిగితే కాలువ పొరంబోకు ఆక్రమించుకోకూడదన్న సమాధానం అధికారుల నుంచి వచ్చింది. అయితే ఇదే నిబంధన ముడిపల్లి పంచాయతీలోని వెంగన్న కండ్రిగకు వెళ్లేసరికి మారిపోయింది. 2022 సంవత్సరంలో టీడీపీ నేతల అధీనంలో ఉన్న కాలువ, కాలువ పొరంబోకును స్వాధీనం చేసుకొని వెంగన్న కండ్రిగ ఎస్టీ కాలనీకి చెందిన 70 కుటుంబాల వారికి శ్మశానానికి దారి వసతి కల్పించారు. దీంతో పాటు, కొండపై నుంచి జాలువారే నీరు చెరువుకు త్వరగా చేరేలా పునరుద్ధరించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 70 కుటుంబాల అవసరాలను వదిలేసి మళ్లీ టీడీపీ నేతలకే అప్పగించింది. ముడిపల్లిలో కాలువ పొరంబోకును స్వాధీనంలో ఉంచుకున్న రైతులకే అప్పగించడం, కాకవేడులో స్వాధీనంలో ఉంచుకున్న రైతుల నుంచి తీసి దారి ఏర్పాటు చేయడం అధికారుల ద్వంద వైఖరికి నిదర్శనంగా నిలుస్తోంది. దీనిపై వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు బుజ్జిరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 70 కుటుంబాలకు ఉపయోగపడే ప్రాంతంలో కాలువ పొరంబోకులో వేసిన రోడ్డును టీడీపీ నేతలకే అప్పగించడం, ఒక టీడీపీ నేత కోసం వైఎస్సార్‌సీపీ నేతల అధీనంలో ఉన్న భూములు స్వాధీనం చేసుకోవడం చూస్తుంటే రెడ్‌బుక్ రాజ్యాంగమే అమలు చేస్తున్నారని ఆరోపించారు. పార్టీలను అనుసరించి నిబంధనలు మార్చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంలో కలుగజేసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.